క్లుప్తంగా

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు



రోడ్డు భద్రతపై ప్రచారం చేస్తున్న హైవే సిబ్బంది

వట్‌పల్లి(అందోల్): మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సిబ్బంది హైవే వాహనదారులకు సూచించారు. సడక్ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం అందోల్ మండలంలోని సంగుపేట వద్ద 161 హైవే సిబ్బంది కరపత్రాలను పంచుతూ వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనదారులు రోడ్డు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని చెప్పారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించి ప్రాణాల మీదుకు తెచ్చుకోవద్దన్నారు. నియంత్రిత వేగంతో మాత్రమే వాహనాన్ని నడపాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను అనుసరించాలని చెప్పారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ శివారులో జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

పార్కుల అభివృద్ధి కృషి

కార్పొరేటర్ పుష్ప



కాలనీవాసులతో మాట్లాడుతున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో శనివారం కార్పొరేటర్ పుష్ప పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. పార్కును అభివృద్ధి చేయాలని కోరారు. పలుచోట్ల డ్రైనేజీ సమస్య ఉందని వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాలనీలోని సొసైటీ ఆవరణలో పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

ఊరడమ్మకు ప్రత్యేక పూజలు



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని గడి మొహల్లాలో ఊరడమ్మ ఆలయంలో ఆషాఢమాసం ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆలయంలో చండీయాగం, హోమం, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదం, అన్నదానం వితరణ చేశారు. ఆదివారం పెద్ద ఎత్తున బోనాల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సిద్ధన్న, సభ్యులు పాండు యాదవ్, పవన్, విక్రమ్, సుధాకర్, రవి, నాగరాజ్, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మ విగ్రహ ఆవిష్కరణ



పూజలు చేస్తున్న భూపాల్‌రెడ్డి దంపతులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఖానాపూర్(కె)లో శనివారం నల్ల పోచమ్మ విగ్రహ ఆవిష్కరణ ఉత్సవం నిర్వహించారు. హోమం, ధాన్యం పూజ, గణపతి పూజ, తదితర కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యేలు ఎం.విజయపాల్‌రెడ్డి, ఎం.భూపాల్‌రెడ్డి ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బాల్‌రెడ్డి, ధరంపాల్‌రెడ్డి, ఉప్పరి అంజయ్య, ఉప్పరి మోహన్, గోపాల్‌రెడ్డి, ప్రశాంత్, నర్వ సాయిలు పాల్గొన్నారు.

హోర్డింగ్..యమ డేంజర్

- ఇళ్లపై ప్రమాదకరంగా హోర్డింగ్‌ల ఏర్పాటు
- ఫ్లెక్సీలు చినిగి విద్యుత్ తీగలు, భవనాలపై పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



భవనంపై పడిపోయిన హోర్డింగ్ ఫ్రేమ్



విద్యుత్ తీగలపై పడిన ఫ్లెక్సీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): హైదరాబాద్ మహానగరానికి శివారు ప్రాంతమైన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అనేక ప్రముఖ సంస్థల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఈప్రాంతం వాణిజ్య ప్రకటనలకు నిలయంగా మారింది. దానిని దృష్టిలో పెట్టుకుని ఆదాయ వనరుల కోసం పెద్ద ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆ హోర్డింగ్‌లే నేడు అనేక ప్రాంతాలలో ప్రమాదకరంగా మారాయి. గతంలో పని చేసిన పలువురు అధికారులు ఈహోర్డింగ్‌లకు ఇష్టానుసారంగా అనుమతులిచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి నిర్మాణాలపై సైతం ఎలాంటి అనుమతులు లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

ఇష్టానుసారంగా ఏర్పాట్లు..

అధికారుల అండతో రేడియల్ రోడ్లను ఆనుకుని, చిన్నపాటి నిర్మాణాలపై పెద్ద ఎత్తున హోర్డింగ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. గతంలో అధికారులు తమ లాభాల కోసం వీటి ప్రోత్సహించారని స్థానికులు వాపోతున్నారు. రేడియల్ రోడ్డును అనుకొని అనేక హోర్డింగ్‌లు నిత్యం ప్రమాదకరంగా మారుతున్నాయి. ఈదురుగాలులు వచ్చిన సమయంలో హోర్డింగ్‌లపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు చినిగిపోయి వాహనదారులపై, విద్యుత్‌తీగలపై ప్రమాదకరంగా పడుతున్నాయి. దాంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతోపాటు వాటిని తొలగించడానికి విద్యుత్ శాఖ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలులకు అనేక ప్రాంతాలలో హోర్డింగ్‌లు కిందపడిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. గత కొద్ది రోజుల క్రితం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఓ ఇంటిపై ఏర్పాటుచేసిన హోర్డింగ్ పడిపోయింది.

అధికారుల లెక్కల ప్రకారం..

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 80 హోర్డింగ్‌లు మాత్రమే ఉన్నాయి. ఇంకా మున్సిపాలిటీలో విలీనమైన 5గ్రామాలలో ఎన్ని హోర్డింగ్‌లున్నాయో అధికారుల వద్ద లెక్క లేకపోవడం విశేషం.

వర్షాకాలంలో తప్పని ఇబ్బందులు..

వర్షాకాలంలో హోర్డింగ్‌లతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈదురు గాలుల కారణంగా హోర్డింగ్‌లపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు 11కేవీ విద్యుత్‌తీగలపై పడుతున్నాయి. దీంతో గతంలో విద్యుత్ శాఖ అధికారులు పలువురికి నోటీసులు ఇవ్వడం జరిగింది.

సర్వే చేసి చర్యలు తీసుకుంటాం



హోర్డింగ్‌లపై సర్వే నిర్వహిస్తాం. అనుమతులు లేని వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

–అజయ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

కేతకీలో తీన్మార్ మల్లన్న పూజలు



కేతకీలో పూజలు చేసిన తీన్మార్ మల్లన్న

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పాదప్రక్షాళన చేసి, గుండంలోని జల లింగానికి పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి, తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించి, పూలమాల శాలువాతో సన్మానించారు. కేతకీ దర్శనం అనంతరం బీసీ నాయకులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం వచ్చే దాకా పోరాడటం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రానికి బీసీనే ముఖ్యమంత్రి ఉండటం జరుగుతుందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలనే గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్, ఆలయ ఈఓ శివరుద్రప్ప, నియోజకవర్గం ఇన్‌చార్జి నర్సింలు, నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వాదంపై సమావేశాలు

అంబేద్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మొగులయ్య



సమావేశం పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

జోగిపేట(అందోల్): ప్రతి గ్రామంలో అంబేడ్కర్ వాదంపై సమావేశాలు నిర్వహించాలని, అంబేడ్కర్ జీవిత చరిత్ర పుస్తకాలు, రాజ్యాంగ పుస్తకాలు చదివేలా చైతన్య పరచాలని అందోల్ అంబేడ్కర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి. మొగులయ్య అన్నారు. శనివారం అంబేడ్కర్ వాదంపై చర్చ గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు భిక్షపతి, లక్ష్మణ్, శంకరయ్య మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహాలను ఎవరు అవమానించిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. గ్రామాల్లో అంబేడ్కర్ వాదాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు.. రాబోయే రోజుల్లో నియోజకవర్గ కేంద్రంలో పెద్ద ఎత్తున చర్చావేదిక కార్యక్రమాలు నిర్వహించి ఉద్యోగులు, యువకులు, మహిళలను సమీకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్,లక్ష్మణ్, దిలీప్ కుమార్, భుజంగం, రమేష్, అమరేందర్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి జోగ్యల్ల రాజు, పట్టణ గౌరవ అధ్యక్షుడు భుజంగ రావు, పోచయ్య, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న బాధ్యులు

నారాయణఖేడ్: రాష్ట్ర దీప, దూప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ కాచిగూడ తుల్జాభవన్ ధర్మశాలలో ఈనెల 14 నుంచి 16 వరకు పంచకుండాత్మక చండీ, కుబేర పాశుపతా యాగం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం అర్చక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడపతి సంగయ్యస్వామి తదితరులు ఎమ్మెల్యే సంజీవరెడ్డికి అందజేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, లోక కల్యాణార్థం నిర్వహిస్తున్న కార్యక్రమానికి విధిగా హాజరుకావాలని కోరారు. అనంతరం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. తెలంగాణ కళాకారులు ఆదివారం మెదక్ పట్టణంలోని టీఎన్జీఓస్ భవన్‌లో నిర్వహించనున్న పాటల పల్లకీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆవిష్కరించారు.

ఆహ్వానపత్రిక అందజేత

నారాయణఖేడ్: హైదరాబాద్‌లో నిర్వహించనున్న బోనాల పండుగకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి అందజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ సంస్థ తరఫున ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్యకు లేఖను పంపించగా శనివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి అందజేశారు.

విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ పరిధిలోని అనేక కాలనీలోని ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెల్లాపూర్‌కు సబ్‌స్టేషన్ మంజూరై ఏళ్లు గడుస్తున్నా నేటి దానిని వినియోగంలోకి తీసుకురాలేదని విమర్శించారు. నిత్యం విద్యుత్ కోతలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు లేఖ రాసినట్లు తెలిపారు.

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ నాయకులు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్సీ అంజిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ పరిధిలో నేడు జరగబోయే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. సర్వే నం 27 తెలంగాణ కాలనీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వివరాలు వివరించారు. అక్రమాలపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ దృష్టికి తెచ్చారు.

ప్రవీణ్‌కు డాక్టరేట్

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి ప్రవీణ్ డాక్టరేట్ అర్హత సాధించారు. ఆర్పీ- హెచ్‌పీఎల్సీ, ఎల్సీఎంఎస్ పద్ధతులను ఉపయోగించి అమిట్రిప్టిలైన్, హైడ్రాక్సీజైన్, డోరిపెనెం యొక్క ఫార్మా స్యూటికల్ మోతాదు రూపాల విశ్లేషణాత్మక ప్రొఫైల్‌పై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శరత్‌బాబు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రవీణ్ సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెజా, సిబ్బంది తదితరులు అభినందించారు.

మొబైల్ దుకాణంలో చోరీ

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని ర్యాకల్ రోడ్డులో ఉన్న ఎంఏ మొబైల్ దుకాణంలో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి దుకాణానికి వచ్చి రూ.22వేల విలువగల వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను తస్కరించాడు. చోరీ వివరాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ విషయంపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ రికార్డులను పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

◆ కొనసాగుతున్న నిరసనలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 158వ రోజుకు చేరుకున్నాయి. శనివారం రిలే నిరాహార దీక్షకు గ్రామస్తులు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం డంపింగ్ ఏర్పాటును విరమించే వరకు నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ దత్తగిరిలో కర్ణాటక మంత్రి పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దిపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో కర్ణాటక రాష్ట్ర అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు వేర్వేరేగా పూజలు చేశారు. వారికి పీఠాధిపతులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఆశ్రమ ఆవరణలో నిర్వహించిన మహా మృత్యుంజయ హోమం, దత్త యజ్ఞం, పూర్ణాహుతి, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, నాయకులు పైడి ఎల్లారెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

◆ ద్వావింశతి చండీయాగం

కల్హేర్(నారాయణఖేడ్): బల్కంచెల్క(భక్తిధామ్) తండాలోని విశ్వపాలిని జ్వాలముఖి భవాని సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో శనివారం ద్వావింశతి చండి యాగం ఘనంగా నిర్వహించారు. మందిరం ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణ శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్‌సింగ్–లలిత దంపతుల ఆధ్వర్యంలో యాగం చేపట్టారు. ప్రముఖ జ్యోతిశ్య వాస్తు శాస్త్ర పండితులు చంద్రమౌళి శర్మ నేతృత్వంలో మందిరంలో ప్రత్యేకంగా పూజలు చేశారు.

వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించండి



ఓఎస్డీకి వినతిపత్రం ఇస్తున్న బృందం

సంగారెడ్డి: స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని వికలాంగుల బృందం ప్రాతినిధ్య సాధన కమిటీ ఆధ్వర్యంలో సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నిబంధనలు, చట్టాల అమలు విధానాలను ఆయనకు వివరించారు. చర్చించిన అన్ని అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అంతేకాక ఈ అంశంపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాల్సిందిగా వికలాంగుల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ అనితరామచంద్రన్‌ను కోరినట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ ఎండీ షఫీ అహమ్మద్ ఖాన్, ఎన్‌పీఆర్డీ ఇండియా జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, వైస్ చైర్మన్ దైనంపల్లి మల్లికార్జున్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త యాదగిరి, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ శబరి చావ్లా, విజయ సింహారెడ్డి ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో క్రియాశీలకంగా పని చేయాలి

కాంగ్రెస్ నాయకుడు నరేష్‌గౌడ్



సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పటాన్‌చెరు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు క్రియాశీలకంగా పని చేసి అధిక సీట్లు గెలుపొందాలని యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో నియోజకవర్గ నాయకులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు ఆర్డినెన్స్ ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, వివేక్ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్యామ్ చరణ్‌రెడ్డి, జిల్లా సహ ఇన్‌చార్జి నాగార్జున, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నరేష్, బలవంత్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌సింగ్, అక్బర్, నవీన్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కుల పంపిణీ చేస్తున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్ టౌన్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు శనివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. వివిధ మండలాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు రూ.13.68 లక్షలు మంజూరయ్యా యి. పట్టణంలోని ఆయన నివాసంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రాములు, రాజశేఖర్, మల్లికార్జున్‌రెడ్డి, అశ్విన్ పాటిల్, ముబీన్, హర్షవర్ధన్‌రెడ్డి, తహేరా బేగం, రాజు, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్కు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం గ్రామానికి చెందిన ఠాగూర్ అర్జున్ సింగ్‌కు ప్రభుత్వం నుంచి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరయింది. జిన్నారం మండల బీజేపీ మండల అధ్యక్షుడు జగన్ రెడ్డి శనివారం చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో చెక్కు మంజూయిందని తెలిపారు. వైద్య సహాయానికి కృషి చేసిన ఎంపీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మెరుగైన వైద్యం కోసం..

హత్నూర(సంగారెడ్డి): పేదలు మెరుగైన వైద్యం చేయించుకునేందుకే ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం హత్నూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన 39 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి హకీం, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బదిలీలు, పదోన్నతులు

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మాణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాణయ్య

జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్ త్వరలో విడుదల కానుందని, పదోన్నతులు కూడా వస్తాయని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల మాణయ్య అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీచర్ల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ గట్టి చర్యలు తీసుకుంటుందన్నారు. ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల జీపీఎఫ్ బకాయిలు నెలాఖరులో వస్తాయని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు తులసీరాం రాథోడ్, నాయకులు వరాలు, శ్రీనివాస్, బాలయ్య, వెంకటేశం, అనిత, బాగయ్య మండలాల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొగుడంపల్లి మండల పీఆర్టీయూ అధ్యక్షుడిగా అర్జున్ చవాన్ నియమితులైయ్యారు.

భగీరథ కార్మికుల ఆందోళన బాట

- ఆరు నెలలుగా జీతాలు అందక ఇబ్బందులు


న్యాల్‌కల్(జహీరాబాద్): వేతనాల కోసం మిషన్ భగీరథ పథకం కార్మికులు మళ్లీ ఆందోళన బాట పట్టనున్నారు. 6 నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్న కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అతి తక్కువ జీతాలతో పని చేస్తున్న తమకు సమయానికి జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు. జీతాల కోసం మూడు నెలల క్రితం కార్మికులు ఆందోళన చేపట్టగా చర్చలు జరిపి జీతాలను త్వరలో చెల్లిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోవడంతో కార్మికులు మళ్లీ ఆందోళన బాట పట్టనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు వారు మిషన్ భగీరథ ఎస్ఈకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. న్యాల్‌కల్ మండలంలోని 39 గ్రామాలతో పాటు తండాలు, ఝరాసంగం మండలంలోని సుమారు 36 గ్రామాలతో పాటు తండాలకు చాల్కి పిల్టర్ బెడ్ ద్వారా మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతోంది. నీటి సరఫరా పథకంలో తాత్కాలిక పద్ధతిన పని చేస్తున్న 24 మంది కార్మికులకు గత ఆరు నెలల నుంచి జీతాలు అందడం లేదు. ఫలితంగా వారు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీతాల కోసం ఆందోళన చేసినప్పుడల్లా జీతాలు చెల్లిస్తామని చెప్తున్నా అధికారులు నెలలు గడిచినా పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేశా రు. చెల్లించాల్సిన జీతాలు జూలై 1న చెల్లిస్తా మని అధికారులు హామీ ఇచ్చారని ఇచ్చిన గడువు ముగిసినా ఇప్పటివరకు వారి నుంచి ఎలాంటి సమాచారం రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఈనెల 17 వరకు చెల్లించని యెడల విధు లు బహి ష్కరించి ఆందోళన చేపడుతామని ఎస్ఈకి ఇచ్చిన వినతిపత్రంలో అల్టిమేటం ఇచ్చినట్లు కార్మికులు వివరించారు.

కరపత్రాల ఆవిష్కరణ

నారాయణఖేడ్: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ పార్టీ నిరంతరంగా ఎపోరాటం చేస్తోందని ఆ పార్టీ ఖేడ్ డివిజన్ కార్యదర్శి ఆనంద్ అన్నారు. ఆగస్టు 2, 3 తేదీల్లో నారాయణఖేడ్‌లో పార్టీ జిల్లా నాల్గొవ మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం ఇక్కడ నాయకులతో కలిసి అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖేడ్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతను ఆదుకోవాలని, వలసలు ఆపాలని కోరారు. ఖేడ్ నియోజకవర్గంలోంచే ప్రవహిస్తున్న మంజీర జలాలు సాగు, తాగుకు అందించాలని డిమాండ్ చేశారు.

బీసీల పోరాట ఫలితమే తీర్మానం

బీసీ నాయకుడు బాలు యాదవ్



మాట్లాడుతున్న బాలుయాదవ్

సంగారెడ్డి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం సంగారెడ్డి నియోజకవర్గం అధ్యక్షుడు బాలుయాదవ్ అన్నారు. క్యాబినెట్ నిర్ణయానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. శనివారం బాలుయాదవ్, రమేష్, జగదీష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు పెంచాలని అనేక రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించామన్నారు. ఇది ముమ్మాటికి బీసీల విజయమన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400